# ఆకస్మిక తనిఖీలో భాగంగా సుడిగాలి పర్యటన చేసిన కలెక్టర్ స్నేహ శబరీష్

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనితీరుపై సీరియస్..**

**సింగారం పాఠశాల టేకు చెట్ల నరికివేతకు పాల్పడిన హెచ్ఎంపై అటవీ శాఖ అధికారికి సీరియస్ ఆదేశాలు**



**తొలి సమయం మహబూబాబాద్ జూన్ 20:**
బయ్యారం మండలం కేంద్రంలో ఆకస్మిక తనిఖీలో భాగంగా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ స్నేహ శబరీష్ సుడిగాలి పర్యటన చేశారు. ముస్తఫానగర్‌లో అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి పిల్లల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకన్నారు అనంతరం బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తరగతి గదులు హాజరు శాతాన్ని పరిశీలన చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధన సరిగా సాగడం లేదని కలెక్టర్ సీరియస్ అయ్యారు సింగారం ప్రధా నోపాధ్యాయులు పాఠశాలలోని టేకు చెట్లు నరికి వేత పై కీలక ఆదేశాలు ఇచ్చారు. మండల అటవీ శాఖ అధికారి రవికిరణ్ వివరణ తీసుకొని విచారణ జరిపి సంబంధిత తక్షణ చర్యలు తీసుకో వాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ నాయక్ జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ సంతోష్ తాసిల్దార్ నాగరాజు ఎంపీడీవో దీపిక ఉపా ధ్యాయులు ధనుంజయ వెంకటేశ్వర్లు ఎస్సై ప్రశాంత్ బాబుఇతర బోధన సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఆత్మీయసమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**మెంచు అశోక్ కుమార్ జేపసీ కన్వీనర్**



**తొలి సమయంమరిపెడ జూన్ 20**
21 వ తేదీన మహబూబాబాద్ పట్టణంలోని ఆర్తి గార్డెన్స్ లో డివిజన్ స్థాయిలో జరుగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతంచేయాలి మరిపెడ జేఏసీ కన్వీనర్ మెంచు అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మరిపెడ మండల కేంద్రం లోని ఉద్యమకారుల మండల బాధ్యులు బోడ రవి నాయక్, అప్సర్, బోడ రమేష్ నాయక్ వెంకట్ రెడ్డి, రాజేందర్, బోడ సురేష్, సలీమ్, జరిగిన సమావేశంలో హాజరయ్యితెలంగాణ అమరవీరుల బలిదానాలు స్మరిస్తూ నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోజరుగనున్నఆత్మీయసమావేశంలోఉద్యమకారుల అభిప్రాయాలు తెలుసు కోవడా నికి తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరాం, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌వస్తున్నారని, మరిపెడ మండలంలోని నిఖార్సైన తెలంగాణ ఉద్యమకారులు అందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు..

# బొద్దుగుండ రైతు వేదికలో రైతులకు అవగాహన

**తొలి సమయం కొత్తగూడ 20 జూన్ 2026**



ఎల్‌నినో ప్రభావం ఉన్న సంవత్సరాల్లో సాధారణంగా వర్షపాతం తగ్గడంతో పాటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ సూచించారు. గూడూరు మండలంలోని బొద్దుగుండ రైతు వేదికలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితులను తట్టుకునే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో జొన్న, సజ్జ, రాగి, పెసలు, మినుములు, కంది, వేరుశెనగ, సోయాబీన్ వంటి తక్కువ నీటి అవసరం కలిగిన పంటలను సాగు చేయడం రైతులకు లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. నీటి లభ్యత కొంత మేర ఉన్న ప్రాంతాల్లో పత్తి సాగు కూడా అనుకూలమని పేర్కొన్నారు. అదేవిధంగా వరి వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగును తగ్గించడం మంచిదని, ముఖ్యంగా నీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. తక్కువ కాలంలో దిగుబడులు ఇచ్చే వంగడాలను ఎంపిక చేసుకోవడం, డ్రిప్ మరియు స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను ఉపయోగించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని వివరించారు. వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు రైతులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ఆలస్యంగా కురిసే వర్షాలకు అనుగుణంగా విత్తనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ సూచనల మేరకు సాగు చేపట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండ కృష్ణ, ఉప సర్పంచ్, వ్యవసాయ విస్తరణ అధికారి () మనోజ్, రైతులు మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. రైతులు పంటల ఎంపిక, నీటి యాజమాన్యం, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

# కొండపాకలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**వీణవంక, జూన్ 20, తొలి సమయం**
వీణవంక మండలంలోని కొండపాక గ్రామంలో డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ -ఇండియా నవక్రాంతి ఉత్పత్తిదారుల సంస్థ బీసీఐ ప్రాజెక్ట్ మరియు ఎస్బిఐ ఆర్ ఎస్ ఈ టి ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నెలరోజుల మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీఐ క్లస్టర్ కోఆర్డినేటర్ మహేందర్ మాట్లాడుతూ రైతు కుటుంబాల జీవనోపాధి పెంపొందించేందుకు వివిధ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలో నిర్వహించిన సర్వే ఆధారంగా మహిళల ఆసక్తులకు అనుగుణంగా మగ్గం వర్క్ శిక్షణను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమార్, మాజీ సర్పంచ్ దాట్ల మంగ, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, హెడ్‌మాస్టర్ రాజయ్య, బీసీఐ అసిస్టెంట్ మేనేజర్ మల్లేష్, సిబ్బంది, శిక్షకులు, లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నారు.

# ఎరువులు, విత్తనాల ధరలను తగ్గించి రైతాంగానికి సబ్సిడీపై అందించాలి

**- ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ**




**తొలి సమయం మహబూబాబాద్ జూన్ 20**
ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీని ఉపసంహరించుకవటం వలన కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెరిగాయని, పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని, నకిలీ విత్తనాలను అరికట్టి రైతాంగానికి అవసరమైన మేరకు అన్ని రకాల నాణ్యమైన విత్తనాలను రైతాంగానికి అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్ ) రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈరోజు ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బయ్యారంలో సంఘం ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి సత్యనారాయణ ప్రసంగిస్తూ 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రకటించిందని కానీ నేడు 53శాతం మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయారని, గౌతం అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతూ రైతాంగాన్ని వీధిన పడేస్తున్నదని అన్నారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధర యిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని విస్మరించిందని తద్వారా ప్రతిసంవత్సరం రెండు లక్షల కోట్ల రూపాయలకు పైగా రైతులు పంటల అమ్మకంలో నష్ట పోతున్నారని అన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రాజ్యమేలుతున్నాయని వ్యవసాయ రంగానికి సబ్సిడీలు యివ్వాలని, కౌలు రైతులతో సహా ప్రతి రైతుకు అవసరమైన పెట్టుబడి రుణాలను బ్యాంకుల ద్వారా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకటించారని, అధికారం లోకి వచ్చిన తర్వాత రైతులను గాలికొదిలేశారని , అన్ని రకాల సన్న ధాన్యానికి క్వింటాలుకు 500 బోనస్ యిస్తామని ఆర్భాటంగా ప్రకటించి ఇప్పుడు కేవలం 7 రకాల వడ్లకే బోనస్ యిస్తామని బుకాయిస్తున్నారని అన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కు మెమోరాండం యిచ్చారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్, రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు మోకాళ్ళ మురళీకృష్ణ, జిల్లా నాయకులు మైల యాకన్న, రామగిరి బిక్షం,పూనెం బిక్షం,తోకల వెంకన్న,బానోత్ నర్సింహా,మెంగు భగవాన్, గుండె బోయిన లింగమల్లు,మేకపోతుల నాగేశ్వరరావు,పూనెం లింగన్న, గంగారపు బిక్షం రాంబాబు, మోకాళ్ళ రమేష్,తుడుం వీరభద్రం,నేతకాని రాకేష్,సజ్జ జలంధర్, తోటకూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

# మండల స్థాయి బౌల అవగాహన సదస్సు

**28న పల్స్ పోలియోను విజయవంతం చేయాలి**

**వైద్యాధికారి డాక్టర్ కవితపారిశుద్ధ్యం క్లోరినేషన్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: అప్సర పాషా**





**తొలి సమయం దంతాలపల్లి జూన్ 20:**
దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో మండల స్థాయి బౌల అవగాహన సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో వైద్యాధికారి డాక్టర్ కవిత మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు,స్టాప్ డయేరియా ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేస్తూ అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ నెల 28వ తారీకు ఆదివారం నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాలలోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని కోరారు,మొదటి రోజు బూత్ సెంటర్లో చుక్కలు వేయడంతో పాటు,రెండవ రోజు, మూడవరోజు ఇంటి ఇంటికి తిరిగి చుక్కలు వేస్తారు అని తెలిపారు,అంగన్వాడి ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి అప్సర పాషా మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని మరియు మురుగు కాలువల శుభ్రత తో పాటు త్రాగు నీటిని క్లోరినేషన్ చేయించాలని ఆంటీ లార్వా ద్రావణాలను నిరంతరం పిచికారి చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొన్నోటి బాలాజీ డిప్యూటీ డి.ఎం అండ్ హెచ్.వో సుధీర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి, తహసిల్దార్ సునీల్ రెడ్డి, నరసింహుల పేట ఎంఈఓ రాములు, మిషన్ భగీరథ మరియు ఇరిగేషన్ ఏఈ లు, ఏపీఎంఓ సంజీవరావు, వెటర్నరీ వైద్యాధికారి, పిడిఎంఓ వాణి,సి హెచ్ ఓ సంజీవరావు హెల్త్ సూపర్వైజర్స్ సుజాత,భీమా నాయక్, చలపతిరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్స్, ఎం ఎల్ హెచ్ పి ఎస్ లు, గ్రామ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్స్, సిస్టర్స్,ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడ బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**వసతి గృహ సంక్షేమ అధికారి ఎస్. కల్పన**

**తొలి సమయం మరిపెడ జూన్ 20**



మహబూబాబాద్ జిల్లా మరిపెడలోని బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి ఎస్. కల్పన తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ మరిపెడలో విద్యనభ్యసిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ , ఓసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకో వచ్చని పేర్కొన్నారు. ఇంటర్మీ డియట్, డిగ్రీ, ఐటీఐ మరియు ఒకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవ డానికి అర్హులని తెలిపారు. ప్రస్తుతం వసతి గృహంలో 80 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం వసతి గృహ సంక్షేమ అధికారి ఎస్. కల్పనను 99483 22446, 63052 08131 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలనిఆమె కోరారు.

# 12వ వార్డులో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం

**ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రనాయక్ చొరవతో అభివృద్ధి పనులు వేగవంతం**

**మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి**

**తొలి సమయం మరిపెడ జూన్ 20**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలోని 12వ వార్డు పరిధిలో ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య, మౌలిక వసతులు కల్పించే దిశగా మరో కీలక అడుగు పడింది. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ ప్రత్యేక చొరవ, సహకారంతో గుండెపూడి క్రాస్ రోడ్డు నుండి కమాన్ సెంటర్ వరకు నిర్మించనున్న సైడ్ డ్రైనేజీ పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. సైడ్ డ్రైనేజీ నిర్మాణంతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. స్థానిక ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఈ డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే వర్షపు నీటి పారుదల సక్రమంగా జరిగి, రహదారులపై నీరు నిల్వ ఉండకుండా నివారించవచ్చని తెలిపారు. ప్రజల



సమస్యల పరిష్కారానికి మున్సిపల్ పాలకవర్గం కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గంట్ల గౌతమ్ రెడ్డి, మెరుగు రాము, జాటోతు సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్, మైనార్టీ కార్యదర్శి మహ్మద్ అప్సర్, గంధసిరి రవి తదితర నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో దుక్కిటెద్దు మృతి

**ఎగ్ ఇన్సులేటర్ లేక కాడెద్దు మృతి**

**తొలి సమయం పెద్ద వంగర జూన్ 20**



చిట్యాల గ్రామ రైతుఎండీ వాలీబాషా అనే రైతు తనకు ఉన్న పొలం దగ్గర నారుమడి దున్నుతుండగా తన పొలములో ఉన్న కరెంటు స్తంభము స్తంభం స్టే వైరు కు స్టే వైర్ కు కరెంటు సరఫరాయి ఆకస్మికం గా పొలము దున్నుతున్న రైతు యొక్క ఎద్దు కరెంటు షాక్ కు గురై వెంబటే చనిపోయింది ఇతను ఆ తీగకు కొద్ది దూరంలో ఉండగా ఇతనికి కొద్దిగా కరెంట్ షాక్ రావడంతో ప్రాణాలతో బయటపడ్డాడు స్తంభముకు ఉన్నటువంటి స్టే వైరు ఆ వైరుకు ఎగ్ ఇన్సులేటర్ పెట్టకపోవడంతో కరెంటు ప్రవహించి ఎద్దు చనిపోవడం జరిగింది ఇది కరెంటు అధికారుల వల్ల నిర్లక్ష్యమే ఈ ప్రమాదం జరిగింది . దీనిని ఇప్పటికైనా గుర్తించి ఆ వైరుకు ఎగ్ ఇన్సులేటర్ అమర్చి రైతు అయిన వలి భాషకు గవర్నమెంట్ నుండి తగిన నష్టపరిహారాన్ని ఇప్పించగలరని రైతు వేడుకుంటున్నాడు

# నకిలీ విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు

**రైతులు తప్పనిసరిగా విత్తనాల రసీదు తీసుకోవాలి**

**జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయ్ చంద్ర**

**తొలి సమయంమరిపెడ, జూన్ 20**
రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడడంతో పాటు నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయ్ చంద్ర తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందం మరిపెడ మండలంలో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా మరిపెడ పట్టణంలోని శ్రీ సీతారామ ఏజెన్సీస్, సూర్య తేజ ఏజెన్సీస్ విత్తనాల విక్రయ కేంద్రాలను ఆయన సందర్శించి స్టాక్ వివరాలు, విక్రయ రికార్డులు, లైసెన్సులు, నిల్వల పరిస్థితిని పరిశీలించారు. తనిఖీల సందర్భంగా కొన్ని దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం గుర్తించిన జిల్లా వ్యవసాయ అధికారి సంబంధిత డీలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలకు సంబంధించిన అన్ని రికార్డులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను ప్రతి డీలర్ తప్పనిసరిగా పాటించాల్సిందేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడిన ఎస్. విజయ్ చంద్ర, రాష్ట్ర ప్రభుత్వం వరి సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ముఖ్యంగా సన్న రకాల వరి సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక బోనస్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాల వరిని సాగు చేసే



రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున అదనపు బోనస్ అందజేయనున్నట్లు వివరించారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ పెరగడం వల్ల మంచి ధర లభించే అవకాశం ఉంటుందని చెప్పారు. రైతులు ధృవీకరించబడిన విత్తనాలనే కొనుగోలు చేయాలని, అనుమతి పొందిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలను తీసుకోవాలని సూచించారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, రసీదు లేకపోతే భవిష్యత్తులో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు నష్టపోయే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాల సంచులపై లాట్ నంబర్, గడువు తేదీ, మొలక శాతం వంటి వివరాలను పరిశీలించి మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాల వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాల ముఠాలు చురుకుగా మారే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కొందరు అక్రమ వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను విక్రయించి మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇటువంటి మోసాల కారణంగా రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూడాల్సి వస్తోందన్నారు. అందువల్ల రైతులు అపరిచిత వ్యక్తుల నుంచి లేదా అనుమతి లేని కేంద్రాల నుంచి విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసినా, అనుమానాస్పద విత్తనాలు మార్కెట్లో కనిపించినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వ్యవసాయ రంగంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా రైతుల పెట్టుబడులను కాపాడటమే శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులు ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ విస్తరణ అధికారులను, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి సాంకేతిక సూచనలు పొందాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, నాణ్యమైన విత్తనాల లభ్యతపై పూర్తి సమాచారం కోసం వ్యవసాయ శాఖతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ఈ తనిఖీల కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (ఏడీఏ) శ్రీదేవి, మండల వ్యవసాయ అధికారి వీరసింగ్, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ అండ

## పరామర్శించి 75 కేజీల బియ్యం అందజేత



**తొలి సమయం కొత్తగూడ 20 జూన్ 2026**

గంగారం మండలం చింతగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు ఇర్ప కన్నక్క (85) ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ 75 కేజీల బియ్యాన్ని ఆర్థిక సహాయంగా అందజేశారు.గ్రామానికి చెందిన కన్నక్క మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కుటుంబ పెద్దను కోల్పోయిన నేపథ్యంలో వారు దిక్కుతోచని స్థితిలో ఉండగా, విషయం తెలుసుకున్న గంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈసం అశోక్, మాజీ జెడ్పీటీసీ ఈసం రామ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు, ఇతర లబ్ధులు కుటుంబానికి అందేలా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.అనంతరం పార్టీ తరఫున మృతురాలి కుమారుడు ఇర్ప రామచంద్రకు 75 కేజీల బియ్యాన్ని అందజేసి, భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా ఇర్ప రామచంద్ర మాట్లాడుతూ, "అమ్మ మృతితో మా కుటుంబం తీవ్ర మనోవేదనకు గురైంది. ఇలాంటి క్లిష్ట సమయంలో కాంగ్రెస్ నాయకులు వచ్చి పరామర్శించి సహాయం చేయడం మాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది" అని భావోద్వేగానికి లోనయ్యారు.ఈ కార్యక్రమంలో ఈసం అనూష, ఈసం సందీప్, ఇర్ప సారయ్య, రవి, నవీన్, సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇల్లందు భూపాలపల్లి

## నూతన ఆర్టీసీ సర్వీస్ ప్రారంభం



**తొలి సమయం ఇల్లందు;జూన్, 20:**

ఇల్లందు నుంచి భూపాలపల్లికి నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను శనివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన సేవలు అందించాలని, ఆర్టీసీని లాభాల బాటలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సుభాషిని, మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్ పెండేలా రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, కో-ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లా సూర్యం, సర్పంచ్ శారద, మహిళా నాయకురాలు రూప, మాజీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డేనియల్, ఇన్‌చార్జి సునీత, సిబ్బంది నాగరాజు, పాషా, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొమరారంను నూతన మండల కేంద్రంగా

## ప్రకటించాలి

**మండల సాధన కమిటీ కన్వీనర్ వాంకుడోత్ మోతీ లాల్**

**తొలి సమయం, కొమరారం; జూన్, 20:**



కొమరారం గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ప్రకటించి, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కొమరారం మండల సాధన కమిటీ కన్వీనర్ వాంకు డోతు మోతిలాల్ డిమాండ్ చేశారు.శనివారం హైదరాబాద్‌లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామో దర రాజనరసింహను కలిసి వినతిపత్రం అందజేశారు. కొమరారం మండలంగా ఏర్పడితే పరి పాలన ప్రజలకు మరింత చేరువ అవుతుందని, ఇల్లందు మం డలం విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు ధ్రువపత్రాల కోసం ఇబ్బం దులు పడుతున్నారని వివ రించారు.స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని, లేకుంటే ప్రజలతో కలిసి దశలవారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై మంత్రి దామోదర రాజనరసింహ సానుకూలంగా స్పందించినట్లు మోతిలాల్ తెలిపారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పట్ల

## సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



**తొలి సమయం, కామేపల్లి; జూన్, 20:**

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కొత్తలింగాల ఎక్స్‌రోడ్డు వద్ద స్వర్గీయ ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి రామ్‌రెడ్డి వెంకట్‌రెడ్డి విగ్రహం సమీపంలో శనివారం కాంగ్రెస్ నాయకులు పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర యువ నాయకుడు రామ్‌రెడ్డి చరణ్‌బాబు ఆదేశాల మేరకు మొక్కజొన్న కొనుగోలు కోసం నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాల్లో వెంటనే నగదు జమ చేస్తున్నందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, తెలంగాణ అగ్రికల్చర్ డైరెక్టర్ రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డిలకు కృతజ్ఞతగా పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, తెలంగాణ అగ్రికల్చర్ డైరెక్టర్ రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

**సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్**





**తొలి సమయం కొత్తగూడ 20 జూన్ 2026**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలలు సాకారమవుతున్నాయని గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ అన్నారు.మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ చొరవతో శనివారం గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడెంకు చెందిన దయ్యాల భాగ్య నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆడబిడ్డ కళ్లలో ఆనందాన్ని నింపేలా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.అదే విధంగా, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారురాలు వాంకుడోత్ కౌసల్య ఇంటి నిర్మాణానికి సంబంధించిన భూమిపూజ కార్యక్రమంలో కూడా సర్పంచ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులు సొంతింటిలోకి ప్రవేశించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ చంటి స్వామి, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎం.డి. రసూల్, వార్డు సభ్యులు వాంకుడోత్ శ్రీను, ధారావత్ కిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎలమందల శ్రీనివాస్, రవి, రంజిత్, బద్రు తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి పేరుతో మోసం.. యువకుడు రిమాండ్‌కు:

## ఎస్సై కోటేశ్వరరావు వెల్లడి

**తొలి సమయం కొత్తగూడ 20 జూన్ 2026**

పెళ్లి చేసుకుంటానని నిశ్చితార్థం చేసుకుని, అనంతరం వివాహానికి నిరాకరించిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది.గంగారం ఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామానికి చెందిన బండి శివ అనే యువకుడు గంగారం మండలానికి చెందిన ఓ యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించాడు. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ ఏడాది ఏప్రిల్ 13న నిశ్చితార్థ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం వివాహ ఏర్పాట్లు కొనసాగుతున్న సమయంలో నిందితుడు వివిధ కారణాలు చెబుతూ పెళ్లిని వాయిదా వేస్తూ వచ్చాడని తెలిపారు. పెళ్లి ఎప్పుడు నిర్వహిస్తారని యువతి, ఆమె కుటుంబ సభ్యులు పలుమార్లు ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం ఇవ్వకుండా చివరకు వివాహానికి నిరాకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్సై తెలిపారు.దీంతో తాను మోసపోయినట్లు భావించిన బాధిత యువతి గంగారం పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, ఫిర్యాదు మేరకు కేసు నమోదు



చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. విచారణలో ఫిర్యాదులోని అంశాలు ప్రాథమికంగా నిజమని తేలడంతో నిందితుడు బండి శివను అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపర్చినట్లు వెల్లడించారు.కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మహిళలను వివాహం పేరుతో మోసం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు బాధితులు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని ఆయన సూచించారు.

## మంత్రి సీతక్క చిత్రపటానికి

## పాలాభిషేకం



**తొలి సమయం ములుగు 20 జూన్ 2026**

గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు అందేలా చర్యలు చేపట్టడంతో పాటు, సర్పంచుల ఐదు నెలల పెండింగ్ వేతనాలను ఒకేసారి విడుదల చేసేలా చొరవ చూపిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్కకు కృతజ్ఞతలు తెలుపుతూ సర్పంచులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు.శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో గ్రామ సర్పంచుల శిక్షణ కార్యక్రమం అనంతరం ఏటూరునాగారం, కన్నాయి గూడెం, తాడ్వాయి, వాజేడు, వెంకటాపూర్ మండలాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు, పారిశుధ్య సిబ్బంది స్వచ్ఛందంగా మంత్రి సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బంది సంక్షేమానికి మంత్రి సీతక్క ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. వేతనాల చెల్లింపులో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపి, సర్పంచుల పెండింగ్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), డీఎల్పీవో, వివిధ మండలాల సర్పంచులు, జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీచర్‌గా పాఠాలు బోధించిన జిల్లా కలెక్టర్

**- రుచికరమైన,నాణ్యమైన డైట్ మెనూ పక్కాగా అమలు చేయాలి**

**పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధనలు ఉండాలి**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**తొలి సమయం మహబూబాబాద్ జూన్ 20**

శనివారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ , జిల్లాలోని బయ్యారం మండల పరిధిలో విస్తృతంగా పర్యటించారు, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి పిల్లలతో స్వయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోనీ అన్ని విద్యాసంస్థలు కలిపి (1032) ఉన్నాయని, అందులో చదువుతున్న 1 లక్ష 90 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన డైట్ మెనూ ప్రకారం పక్కాగా బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, స్నాక్స్ అందించాలని, పిల్లలకు అర్థమయ్యే రీతిలో డిజిటల్ తరగతుల ద్వారా విద్య బోధనలు అందించాలని, ప్రతి ఒక ఉపాధ్యాయుడు అందుకు అనుగుణంగా పకడ్బందీ ప్రణాళిక ద్వారా టైం టేబుల్ సిద్ధం చేసుకోవాలని, పిల్లలను వ్యక్తిగతంగా గమనిస్తూ ఉండాలని, విద్య అంశాలపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు,బడిబాట కార్యక్రమంలో ఇప్పటివరకు 6వేల 709 మంది విద్యార్థినీ విద్యార్థులు నమోదు చేసుకోవడం



జరిగిందని, మరింత విస్తృత ప్రచారం అవగాహన కల్పించి ప్రభుత్వ విద్యా సంస్థలలో అందిస్తున్న సౌకర్యాలను తెలియపరచాలని తద్వారా నమోదు శాతం పెంచేందుకు అన్ని విద్యాసంస్థల సిబ్బంది కృషి చేయాలని సూచించారు, మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్న సిబ్బంది, కిందిస్థాయి ఉద్యోగుల కు కచ్చితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని అట్టి నివేదికలను సమర్పించాలని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు, ప్రతి ఒక్కరికి టెస్ట్ బుక్కులు ,నోట్ బుక్స్ అందించాలని, తెలుగు అన్ని సబ్జెక్టులతో పాటు ఇంగ్లీషులో ప్రావిణ్యం పొందడం కోసం ఉపాధ్యాయులు ఇంగ్లీషులోనే పిల్లలకు విద్యను అందించాలని, వారితో మాట్లాడాలని తెలిపారు,జిల్లా వ్యాప్తంగా పిల్లలకు విద్యాబోధనలు హెల్త్ ,సానిటేషన్, న్యూట్రిషన్, మెడిటేషన్, క్రీడా, మేధస్సు లను వెలికి తీయాలని, విద్య అంశాలకు సంబంధించి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని



ఆదేశించారు.ప్రతిరోజు విద్యాసంస్థలలో సానిటేషన్ పక్కాగా నిర్వహించాలని, స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని, విద్యుత్, సరఫరా ఆటంకం లేకుండా చూడాలని, టాయిలెట్ స్, డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందించాలని, కోడిగుడ్లు, బాలామృతం, తదితర పౌష్టిక ఆహారం కలిగిన నాణ్యమైన పదార్థాలను అందించాలని అన్నారు, అంగన్వాడి కేంద్రం పరిధిలో శ్యామ్, మ్యామ్ పిల్లలను గమనిస్తూ ఉండాలని వారికి సమయానికి మందులు అందిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు,ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, బయ్యారం తహసిల్దార్ నాగరాజు, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

## యూరియా యాప్‌తో రైతులకు తిప్పలు

**సిగ్నల్ సమస్యలు, సాంకేతిక లోపాలతో అన్నదాతల ఆందోళన**


**యాప్ రద్దు చేసి పాత విధానంలోనే ఎరువులు అందించాలని డిమాండ్**

**తొలి సమయం కొత్తగూడ 20 జూన్ 2026**

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కొనుగోలుకు ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్ తరచూ సాంకేతిక లోపాలకు గురవుతుండటంతో రైతులు గంటల తరబడి మొబైల్ ఫోన్ల ముందే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. యాప్‌ను ఎన్నిసార్లు ఓపెన్ చేసినా "నాట్ ఫౌండ్", "ఎర్రర్" వంటి సందేశాలు రావడంతో బుకింగ్ ప్రక్రియ పూర్తికాక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేకించి మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాల ఏజెన్సీ ప్రాంతాల్లో సమస్య మరింత తీవ్రంగా ఉంది. అటవీ ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సిగ్నల్స్ సరిగా అందుబాటులో లేకపోవడం వల్ల యాప్ పనిచేయడం లేదు. కొన్ని చోట్ల సిగ్నల్ ఉన్నప్పటికీ యాప్‌లో స్టాక్ వివరాలు కనిపించకపోవడం, బుకింగ్ పూర్తికాకపోవడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది.గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని అనేక మంది రైతులు స్మార్ట్‌ఫోన్ వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడం కూడా సమస్యను మరింత పెంచుతోంది. నిరక్షరాస్యులు, వృద్ధ రైతులు యాప్ వినియోగంలో ఎదురయ్యే ఇబ్బందుల కారణంగా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో సమయం, డబ్బు రెండూ వృథా అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పంటలకు అత్యంత కీలకమైన సమయంలో యూరియా



అందకపోవడంతో సాగు పనులు ఆలస్యమవుతున్నాయని రైతులు చెబుతున్నారు. యాప్‌లో స్టాక్ లేదని చూపించడం, ఎక్కడ అందుబాటులో ఉందో స్పష్టమైన సమాచారం లేకపోవడం వల్ల రైతులు ఎరువుల కోసం సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొంది.ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం తీసుకొచ్చిన యాప్ ప్రస్తుతం రైతులకు భారంగా మారిందని అన్నదాతలు విమర్శిస్తున్నారు. సాంకేతిక సమస్యలతో రైతుల జీవితాలతో ఆటలాడకుండా వెంటనే యాప్‌లోని లోపాలను సరిచేయాలని, లేకపోతే యాప్ విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరిగానే నేరుగా యూరియా పంపిణీ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత, యాప్ సమస్యలు కొనసాగితే పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ తక్షణ చర్యలు తీసుకుని యూరియా సరఫరాను సులభతరం చేయాలని వారు కోరుతున్నారు.యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన చెందవద్దు : మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్మండలంలోని రైతులకు యూరియా ఎరువుల కొరత ఉండదని, ప్రభుత్వం రైతుల అవసరాలకు అనుగుణంగా సరిపడా యూరియాను అందుబాటులో ఉంచిందని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ తెలిపారు.ఇటీవల యూరియా బుకింగ్ కోసం వినియోగిస్తున్న యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొంతమంది రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. యాప్ కొత్తగా అమల్లోకి రావడంతో ప్రారంభ దశలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని, యూరియా సరఫరాలో




ఎటువంటి అంతరాయం ఉండదని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన మేరకు యూరియా అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. యాప్‌లో ఎదురవుతున్న సమస్యలు తాత్కాలికమేనని, త్వరలోనే పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.రైతులు ప్రశాంతంగా ఉండాలని, యూరియా కొరతపై అనవసర ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ సూచించారు.

## రాజీ మార్గమే రాజమార్గం

## జడ్జి స్వరూప కాటం



తొలి సమయం, ఇల్లందు;జూన్, 20:
ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఇల్లందు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామస్థాయిలో చిన్నచిన్న వివాదాలను క్షణికావేశానికి లోనుకాకుండా పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని సూచించారు. కోర్టు కేసుల వల్ల సమయం, ధనం వృథా కాకుండా రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాల సమన్వయంతో పరిష్కరించుకుని జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.జాతీయ లోక్ అదాలత్‌లో గృహహింస, మనోవర్తి, చెక్ బౌన్స్, సివిల్, బ్యాంకు తదితర కేసులు కలిపి మొత్తం 807 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.కే.ఎం.డి. కాసిం, సీనియర్ న్యాయవాదులు ఎన్. మల్లికార్జునరావు, పి. బాలకృష్ణ, దంతాల ఆనంద్, పెద్దూరి వెంకట నరసయ్య, జూనియర్ న్యాయవాదులు కే. ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తిక్, కోర్టు సూపరింటెండెంట్ శ్రీరంగం రామకృష్ణ, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సేవా యజ్ఞం

## ఉచిత హోమియో వైద్య శిబిరం



తొలి సమయం, కొత్తగూడెం; జూన్ 20:
మాస్టర్ ఈకే ఆధ్యాత్మిక సేవా సంస్థ కొత్తగూడెం బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం రామవరం 16వ డివిజన్‌లోని నాగయ్యగడ్డ శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో గ్రామ సేవా యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంస్థ ప్రతినిధి రవిచంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మునిగడప పద్మ-వెంకటేశ్వర్లు దంపతులు పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో సుమారు 100 మంది రోగులను పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా కేస్‌షీట్లు తయారు చేసి ఉచిత హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ ఆరోగ్యానికి సరైన ఆహారం, జీవనశైలి, ప్రకృతితో సత్సంబంధాలు ఎంతో ముఖ్యమని, ఔషధ సేవ తర్వాతి స్థానంలో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ఈకే సంస్థ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## వైభవంగా వివాహ వేడుక..

## వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క



తొలి సమయం ములుగు 20 జూన్ 2026
మల్లంపల్లి మండలం ఎం.డి. గౌస్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుట్ట బుచ్చయ్యరేణుక దంపతుల కుమార్తె బుట్ట అనూష వివాహం రణధీర్‌తో శనివారం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, వివాహం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్రమైన బంధమని పేర్కొన్నారు. వధూవరులు పరస్పర ప్రేమ, గౌరవం, అవగాహనతో జీవితాన్ని ఆనందంగా సాగించాలని ఆకాంక్షించారు. నూతన దంపతులు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖసంతోషాల మధ్య జీవించాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పార్టీ నాయకులు మేకల ప్రశాంత్, బుట్ట నాగరాజు, ముంజాల కుమారస్వామి, ఉప్పు మొగిలి, జట్టీ విజయ్, కనకం రవి, గోల్కొండ సురేష్ తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.గ్రామ ప్రజలు, బంధుమిత్రులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వివాహ వేడుకను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగి అందరినీ ఆకట్టుకుంది.

# ధాన్యం కొనుగోళ్లు, యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్

తొలి సమయం ఇల్లందు;జూన్, 20:
ధాన్యం కొనుగోళ్లు, యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై రైతులను దళారులపై ఆధారపడే పరిస్థితి తీసుకొచ్చిందని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బానోత్ హరిప్రియ నాయక్ ఆరోపించారు.బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు శనివారం ఇల్లందు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రైతులకు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుందని, కేంద్రం సూచించిన పరిమితిలోనే ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పడం వల్ల మిగిలిన ధాన్యాన్ని రైతులు దళారులకు అమ్ముకుని నష్టపోతున్నారని విమర్శించారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసేదని, రైతుబంధు, రైతు బీమా, మిషన్ కాకతీయ వంటి పథకాల ద్వారా వ్యవసాయ రంగానికి బలమైన అండగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతు బీమా క్లెయిమ్‌లు సకాలంలో చెల్లించడం లేదని, రైతుబంధు పెంపు హామీని కూడా అమలు చేయకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు.రైతుల సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న



ప్రకటనలకు, అమలుకు పొంతన లేదని, రైతు సమస్యలను పరిష్కరించకపోతే గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్, భూక్య ధల్‌సింగ్ నాయక్, అబ్దుల్ జబ్బర్, అబ్దుల్ నబీ, శీలం రమేష్, వరప్రసాద్ గౌడ్, దాస్యం ప్రమోద్, భావ్‌సింగ్ నాయక్, దేవిలాల్ నాయక్, రంగనాథ్, నెమలి ధనలక్ష్మి, తోట లలిత శారద, నారాయణమ్మ, గిన్నారపు రాజేష్, కాసాని హరిప్రసాద్ యాదవ్, సత్తాల హరికృష్ణ, నీలం రాజశేఖర్, ఎస్కే చాంద్ పాషా, బిపిన్ నాయక్, పాబోలు కిరణ్, ఎస్కే పాషా, మూలగుండ్ల ఉపేందర్‌రావు, సనా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు అర్థమయ్యేలా బోధన అందించాలి

### ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు

### చెప్పిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

తొలి సమయం మహబూబాబాద్ 20 జూన్ 2026
బయ్యారం మండలంలో శనివారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ విస్తృతంగా పర్యటించి పలు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా స్థాయిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ వారి ప్రతిభను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1,032 విద్యాసంస్థల్లో చదువుతున్న సుమారు 1.90 లక్షల మంది విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన డైట్ మెనూ ప్రకారం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, స్నాక్స్ నాణ్యతతో అందించాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా డిజిటల్ తరగతుల ద్వారా బోధన చేపట్టాలని, ఉపాధ్యాయులు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికతో టైం టేబుల్ రూపొందించి విద్యార్థుల పురోగతిని నిరంతరం గమనించాలని సూచించారు.విద్యార్థుల విద్యా అభివృద్ధి కోసం తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. బడిబాట కార్యక్రమం ద్వారా



ఇప్పటివరకు 6,709 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచేందుకు అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని ఆదేశించారు.మధ్యాహ్న భోజన తయారీలో పాల్గొనే సిబ్బందికి, ఇతర కింది స్థాయి ఉద్యోగులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందేలా చూడాలని, తెలుగు సహా అన్ని సబ్జెక్టులతో పాటు ఇంగ్లీష్ భాషలో కూడా ప్రావీణ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులతో ఇంగ్లీష్‌లో సంభాషించాలని సూచించారు.విద్యతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం, ధ్యానం, క్రీడలు, మేధో వికాసం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యా వ్యవస్థలో నిర్లక్ష్యం



ప్రదర్శించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విద్యాసంస్థల్లో ప్రతిరోజూ పారిశుద్ధ్యాన్ని నిర్వహించి స్వచ్ఛమైన తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, తరగతి గదులు, టాయిలెట్లు, డైనింగ్ హాళ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కోడిగుడ్లు, బాలామృతం తదితర పోషకాహార పదార్థాలను నాణ్యతతో అందించాలని ఆదేశించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి వారికి అవసరమైన వైద్యం, కౌన్సెలింగ్ అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, బయ్యారం తహసీల్దార్ నాగరాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం సహాయక సంఘాలతో పంట మార్పిడి

### 50 ఎకరాల్లో కూరగాయలు, పండ్లు,

### ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

తొలి సమయం మహబూబాబాద్ 20 జూన్ 2026
కూరగాయలు, పండ్లు, ఆయిల్‌పామ్, పూలు, మునగ, మల్బరీ, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగును విస్తరించేందుకు స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పంట మార్పిడి కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ పిలుపునిచ్చింది. ప్రతి స్వయం సహాయక సంఘం ద్వారా కనీసం 50 ఎకరాల్లో పంట మార్పిడి చేపట్టేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.శనివారం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీమతి స్నేహ శబరీష్, ఐఏఎస్ ఆదేశాల మేరకు కురవి మండలంలోని నేరడ, మచ్యతండా, బాల్యతండా ప్రాంతాలకు చెందిన రైతు ఉత్పత్తిదారుల కంపెనీల సభ్యులకు జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయం, మహబూబాబాద్‌లో అలాగే కేసముద్రం మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీల సాధారణ సర్వసభ్య సమావేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం మరియు మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న టమాటా, వంకాయ, పచ్చిమిర్చి, దోసకాయ, బీరకాయ, సొరకాయ, గోరుచిక్కుడు, బెండకాయ, ఆకుకూరలు, మునగ తదితర పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అలాగే షేడ్‌నెట్‌ల కింద టమాటా, కీరదోస వంటి పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు.జిల్లాలో ఇప్పటికే 5 వేల ఎకరాలకు పైగా కూరగాయల సాగు జరుగుతోందని, రైతులు నూతన మరియు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని



సూచించారు. షేడ్‌నెట్ సాగు, ట్రెల్లిస్ విధానం, పందిరి సాగు వంటి పద్ధతులు దిగుబడులు పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నిత్యాదాయం అందించే కూరగాయల సాగు వైపు రైతులు మరింతగా మొగ్గుచూపాలని కోరారు.ప్రభుత్వం రైతులకు కూరగాయల సాగు కోసం పలు రాయితీలు అందిస్తోందని తెలిపారు. అంతర పంటల సాగుకు ఎకరానికి రూ.2,100, శాశ్వత పందిరి నిర్మాణానికి ఎకరానికి రూ.1 లక్ష వరకు రాయితీ, కూరగాయల నారు మొక్కల సరఫరాకు ఎకరానికి రూ.10 వేల వరకు సాయం, కూరగాయల విత్తన కిట్ల పంపిణీ వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ప్యాషన్ ఫ్రూట్ వంటి పండ్ల తోటలతో పాటు మునగ, వెదురు వంటి అధిక ఆదాయం ఇచ్చే పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఎకరానికి లక్ష రూపాయల వరకు నికర ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు.పొలం గట్లు, పెరటి స్థలాలు, ఇంటి ముంగిట, డాబాలు, ఆయిల్‌పామ్ మరియు పండ్ల తోటల్లో అంతర పంటలుగా కూరగాయల సాగు చేపట్టి కుటుంబ అవసరాలకు సరిపడే రసాయన రహిత, నాణ్యమైన ఆహారాన్ని స్వయంగా ఉత్పత్తి చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, ప్రోట్రే నారు పెంపకం, వేపనూనె పిచికారీ, పసుపురంగు అట్టల వినియోగం వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, ఉద్యాన శాఖ అధికారి ఆర్. శాంతిప్రియ, కురవి డీఆర్‌డీఏ సహాయ ప్రాజెక్టు మేనేజర్ దుర్గా, సీఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.